ఉచిత మెగా వైద్యశిబిరానికి భారీ స్పందన



ఘట్‌కేసర్: అవుషాపూర్ సెయింట్ పాల్స్ హై స్కూల్‌లో ఆ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో మలక్‌పేట్ యశోద ఆసుపత్రి సౌజన్యంతో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ముఖ్యఅతిథిగా ఆ పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కిశోర్‌కుమార్ హాజరై శిబిరం ప్రారంభించారు. శిబిరంలో 300 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, స్కూల్ డైరెక్టర్స్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, విజయ్‌చంద్ర, వరప్రసాద్, ప్రిన్సిపాల్ సుశీల, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



యజ్ఞశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలోని షిర్డీసాయి ద్వారకామాయి ఆలయంలో శనివారం యజ్ఞశాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి బాబాను దర్శనం చేసుకున్నారు. పలువురు స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ



మహా పడిపూజలో విక్రమ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకులు

కీసర: చీర్యాలకు చెందిన గురుస్వామి రావుల ముత్యం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి 18వ మహా పడిపూజ అంగరం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ పూజా కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి, నేతలు కొంపల్లి మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్

ఘట్‌కేసర్: సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నిరుపేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన కొర్రెములకు చెందిన సత్యనారాయణకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 49,500 చెక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేష్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్సీ కోదండరాం సంఘీభావం



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

ఘట్‌కేసర్: రైల్వే వంతెనను త్వరితగతిన నిర్మించాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్సీ కోదండరాం శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న రైల్వే వంతెన పనులు త్వరగా పూర్తి చేయించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం దీక్షలో పాల్గొన్న మహిళలకు నిమ్మరసం అందజేసి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

స్థానిక సమరానికి సన్నద్ధం

- ఈ నెల 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల
- జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే ఛాన్స్
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు
- ఓటర్ల జాబితా సిద్ధం చేసిన పంచాయతీ శాఖ



సాక్షి,సిటీబ్యూరో: పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జనవరిలో నోటిఫికేషన్ వెలువడవచ్చనే సంకేతాలతో ఏర్పాట్లపై దృష్టిసారించారు. గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేయగా, తాజాగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు సైతం పూర్తి చేశారు. త్వరలో కొత్త సర్పంచులు వస్తారని ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు గ్రామాల్లో కార్యకలాపాలు ముమ్మరం చేశారు. ఒక్కొక్క వార్డుకు ఒక్కొక్క పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 580 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్ జిల్లాలో 34 గ్రామ పంచాయతీలు ఉండగా, 65,773 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 33,020 మంది వుండగా, మహిళా ఓటర్లు 32,750 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు ముగ్గురు ఉన్నారు. మేడ్చల్ జిల్లాలో మొత్తంగా 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశముంది. ఇందులో 200పైగా ఉన్న ఓటర్ల కోసం 197 పోలింగ్ కేంద్రాలు, 400 ఓటర్ల కోసం 98 పోలింగ్ కేంద్రాలు, 401 నుంచి 650 ఓటర్ల కోసం 25 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ లెక్కన రంగారెడ్డి జిల్లాలో కూడా 200 మంది ఓటర్ల నుంచి 600 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని గుర్తించారు. బ్యాలెట్ పేపర్లను పంచాయతీ అధికారులు అందించనుండగా, గుర్తులను మాత్రం ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించనుండటంతో వాటి వివరాలను ఇప్పటికే సేకరించారు. అభ్యర్థులను బట్టి బ్యాలెట్ పేపర్ సైజ్ ఉంటుంది.

తుది పోలింగ్ కేంద్రాల జాబితా

గ్రామాలు, వార్డుల వారీగా ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేయగా తాజాగా పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరించి.. ఈ నెల 17న తుది జాబితాను ప్రకటించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండల స్థాయిలో పోలింగ్ కేంద్రాల జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి అభ్యంతరాలను స్వీకరించారు. ఈ నెల 18న పరిష్కారం చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్నచోట నూతనంగా మరొకటి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కుటుంబ సభ్యుల ఓట్లు వేరువేరు పోలింగ్ కేంద్రాల్లో ఉండగా.. వాటిని ఒకే కేంద్రంలో ఉండేలా సర్దుబాటు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నియామకం, సంబంధిత అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించడం తదితర ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు చకచకా ఏర్పాట్లు పూర్తవుతున్నట్లు అధికార వర్గాలు తెలుపుతున్నారు.

వ్యూహాలకు పదును

పార్టీల గుర్తులు లేకపోయినా అభ్యర్థిని బట్టి ప్రజలు చూసి ఓటేస్తారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ మద్దతుదారులు రంగంలోకి దిగనున్నారు. పార్టీ నేతలు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మాజీ ప్రజాప్రతినిధులు మళ్లీ బరిలో నిలిచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. రిజర్వేషన్లు ఎలా ఉన్నా తమ కుటుంబీకులను నిలపాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఈసారి పట్టు బిగిస్తే రాబోయే ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది. బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ముగిసి, డేటా ఎంట్రీ పూర్తయ్యింది. రిజర్వేషన్లను కొత్తగా ఖరారు చేయనుండటంతో మార్పులు జరిగే అవకాశం ఉంది. దీంతో ఆశావాదుల్లో ఉత్కంఠ పెరిగింది. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా సమర్థంగా ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లతోపాటు సామగ్రిని మండలాల వారీగా పంపిణీ చేస్తున్నామని పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

మేడ్చల్‌లో ఎన్నికలపై భిన్నస్వరాలు

మేడ్చల్ జిల్లాలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికారయంత్రాంగం గ్రామ పంచాయతీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నప్పటికిని, రాజకీయ వర్గాల నుంచి భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా.. లేదానన్న మీమాంస కూడా రాజకీయవర్గాల్లో నెలకొంది. జిల్లాలోని 34 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిని ప్రభుత్వం నాలుగు మున్సిపాలిటీలుగా మార్చే అవకాశముందన్న ప్రచారం కూడా స్థానిక రాజకీయ వర్గాలతోపాటు ప్రజల్లో జోరుగా సాగుతోంది.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

మేడ్చల్‌రూరల్: దత్త జయంతి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘనాపూర్ గ్రామ పరిధిలోని మల్లిఖార్జున స్వామి గుట్టపై దత్తాత్రేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ జనార్థన్‌రావు, ప్రభావతి దంపతులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకులు జీవన్‌రావు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూడూర్ గ్రామంలోని సాయిబాబా ఆలయంలో ఉన్న దత్తాత్రేయునికి నిర్వాహకులు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూలు చేశారు. పూజల్లో అర్చకులు వెంకటేష్‌శర్మ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

విద్యార్థులకు కామన్ డైట్ ప్లాన్



నూతన డైట్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపికరెడ్డి

మేడ్చల్: ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే పిల్లలకు పౌష్టిక ఆహారం అందించేందుకు ప్రభుత్వం కామన్ డైట్ ప్లాన్ తీసుకు వచ్చిందని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని బాలుర, బాలికల వసతి గృహాలలో కామన్ డైట్ ప్లాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకునే పిల్లల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి నూతన డైట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం హర్షనీయమన్నారు. గ్రీన్ ఛానెల్ ద్వారా ప్రతి నెల 10వ తేది లోపు వసతి గృహాలు, గురుకులాలకు బిల్లులు అందుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణం కోసం భూమి అప్పగించడానికి రోడ్డు విస్తరణ పనులు శనివారం ప్రారంభించారు. వంతెన నిర్మాణంలో భూములు కోల్పోయి నష్టపరిహారం తీసుకున్న 25 మంది బాధితులు కూల్చివేతలకు సహకరించడానికి ముందుకు వచ్చారు. స్థానిక తహసీల్దార్ రజని, రోడ్డు భవనాలశాఖ అధికారుల ఆధ్వర్యంలో కట్టడాలను కూల్చివేయించారు.



రోడ్డు విస్తరణ కోసం చేపట్టిన కూల్చివేతలు

కూల్చివేతలను పరిశీలించిన నాయకులు..

రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, జంగయ్యయాదవ్ పరిశీలించారు. బాధితుల విన్నపం మేరకు మిగిలిన వారికి నష్టపరిహారం అందే విధంగా ఐటీ శాఖా మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకులాలు



పాఠశాలను ప్రారంభిస్తున్న రాచకొండ డీసీపీ పద్మజ

శామీర్‌పేట్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం వసతులను కల్పిస్తుందని రాచకొండ డీసీపీ పద్మజ అన్నారు. గురుకులాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన డైట్ మెనూ సందర్భంగా మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీపీ పద్మజ మాట్లాడుతూ.. మైనార్టీ పాఠశాల పట్టణ కాలుష్యానికి దూరంగా, ప్రశాంత వాతావరణంలో ఉందన్నారు. నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మెనూ విద్యార్థుల యొక్క ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మూడుచింతలపల్లి ఎంపీడీఓ మంగతాయారు, పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



కీసర: యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచిన రాష్ట్ర సెక్రటరీ చాకలి శైలేందర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లపాటి అరవింద్ శనివారం ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బసవరాజు సారయ్యను కలిశారు. అనంతరం ఆయన వారిని అభినందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘాల సమన్వయ కమిటీ చీఫ్ అడ్వైజర్ కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధనాన్ని పొదుపుగా వాడాలి

ఘట్‌కేసర్: ఇంధనాన్ని పొదుపుగా వినియోగించి శక్తి వనరులను సంరక్షించాలని ఫోర్‌పీ ఎనర్జీస్ సీఈఓ శివకుమార్ అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం పుర్కరించుకొని ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంధనాన్ని మళ్లీ మళ్లీ వాడడం, వాడకం తగ్గించడం, రీసైకిల్ చేసి మరలా వాడే పద్ధతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. గౌరవ అతిథి డీఈఈటీ వింగ్ కార్పొరేట్ రిసేషన్స్ డైరెక్టర్ వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంధన పొదుపుపై సృజనాత్మక ఆలోచనలు, వినూత్న పరిష్కారాలు చూపాలన్నారు. సదస్సులో విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానకిరాములు, హెచ్‌ఓడీలు శ్రీధర్, శివకేశవరెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో అతిథులు శివకుమార్, వంశీధర్‌రెడ్డితో కళాశాల ప్రతినిధులు

అదనపు తరగతి గది ప్రారంభం



తరగతి గదిని ప్రారంభిస్తున్న మల్లారెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: పోచారం మున్సిపాలిటీ అన్నోజీగూడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బోయపల్లి నర్సమ్మ, సత్తిరెడ్డి జ్ఞాపకార్థం ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ వైస్‌చైర్మన్ మల్లారెడ్డి సొంత నిధులు 8.5 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదిని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. సొంత నిధులతో పేద విద్యార్థుల కోసం అదనపు తరగతి గదిని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేష్, రవీందర్‌గౌడ్, హెచ్‌ఎం, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ సత్తిరెడ్డి, శేఖర్ ముదిరాజ్, బుచ్చిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, నరసింహా, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు ఎంపిక

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాల (వీబీఐటీ)లో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్న జేఎన్టీయూహెచ్ వాలీబాల్ పురుషుల జట్టును శనివారం ఎంపిక చేశారు. వీబీఐటీలో ఐదు రోజులుగా వారు శిక్షణ పొంది యూనివర్సిటీ ఆఫ్ కేరళలో ఈ నెల 18–22 వరకు జరుగనున్న వాలీబాల్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్‌లో జేఎన్టీయూహెచ్ జట్టుకు ప్రాతినిత్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎంపికై న వాలీబాల్ క్రీడాకారులను వీబీఐటీ చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాసరావు అభినందించారు. జట్టుకు కోచ్‌గా పీడీఎం శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులుగా శివరాజు, మధు, హర్ష, స్నేహిత, విశాల్, రాహుల్, భాను, నాగసాయి బులిరెడ్డి, శ్రీధర్ తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ దిలీప్, జేఎన్టీయూ పీడీ అశోక్ పాల్గొన్నారు.



జేఎన్టీయూహెచ్ జట్టును అభినందిస్తున్న వీబీఐటీ చైర్మన్ గౌతంరావు తదితరులు

బిట్స్ పిలానీలో వర్క్‌షాప్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని హైదరాబాద్ బిట్స్ పిలానీ, తెలంగాణ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఆర్ ఈడీసీఓ), హైదరాబాద్ సెంటర్ ఫర్ రీసెర్చ్ ఎక్సలెన్స్ ఇన్ నేషనల్ సెక్యూరిటీ సహకారంతో శనివారం బిట్స్ పిలానీ క్యాంపస్‌లో పునరుత్పాదక శక్తి అవగాహనపై పలు ఉన్నత పాఠశాలలకు చెందిన అధ్యాపకులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రీన్ ఎనర్జీ సెంటర్ హెడ్ డాక్టర్ మధు చంద్రిక చటోపాధ్యాయ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలానీ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ యోగేశ్వరి, ప్రొఫెసర్ సబరీష్, పరమేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను సందర్శించిన ఉన్నతాధికారులు



ఘట్‌కేసర్ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతం



ఇబ్రహీంపట్నం డిగ్రీ కళాశాలలో సహపంక్తి భోజనం..



మల్కాజ్‌గిరిలో.. బాలుర పాఠశాలలో మెనూ పట్టికను ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ వినయ్‌కృష్ణారెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం పెంచిన 40 శాతం డైట్ చార్జీలు పెంచిన సందర్భంగా పలువురు ఉన్నతాధికారులు సాంఘీక సంక్షేమ జ్యోతిరావు పూలే గురుకులాలను శనివారం సందర్శించారు. ఎదులాబాద్‌లోని తెలంగాణ ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌ను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, అంకుషాపూర్‌లోని జగద్గిరిగుట్ట బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను డ్రగ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ కమలహాసన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం మహిళా డిగ్రీ కళాశాలను హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, ఘనాపూర్‌లోని జ్యోతిరావు పూలే బాలుర పాఠశాలను ఐఏఎస్ వినయ్ కష్ణారెడ్డి, డీఆర్‌డీఓ సాంబశివరావు పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెంచిన మెస్ చార్జీలను తక్షణమే అమలు చేసి మెనూ చార్ట్‌లో నిర్ణయించిన మేరకు పౌష్టికాహారం వడ్డించాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఫ్యాకల్టీకి సూచించారు. ఆహారం రుచిగా వండడానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తామని, అన్ని వసతి గృహాలలో ఏక రీతి ఆహారం అందించాలని ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ రజని, ప్రిన్సిపాల్స్ రాధిక, రేణుక, వైస్ ప్రిన్సిపాల్స్ రాములు, రాము పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సహపంక్తి భోజనాలు

కీసర: ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా కీసరగుట్టలోని గురుకుల పాఠశాల ఆహ్వానం మేరకు శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించారు. అనంతరం వారి పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన డైట్‌ను ప్రారంభించిన శ్రీధర్

మేడ్చల్: వసతి గృహాలలో, గురుకుల పాఠశాలలో ప్రభుత్వం చేపట్టిన నూతన డైట్ మెనూ కార్యక్రమాన్ని ఐపీఎస్ అధికారి శ్రీధర్ ప్రారంభించారు. పట్టణంలోని కిష్టాపూర్‌లోని గురుకుల పాఠశాలలో ఆయన నూతన డైట్‌ను ప్రారంభించారు. 40 శాతం డైట్ చార్జీలు పెరగడం వల్ల మరింత పౌష్టికాహారం అందుతుందన్నారు. శ్రీధర్ పిల్లలతో, పిల్లల తల్లిదండ్రులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లలకు అందుతున్న డైట్‌ను ఆయన పిల్లలకు వివరించారు.



పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తల్లిదండ్రులు



కీసరలో.. సహపంక్తి భోజనం చేస్తున్న బీసీ గురుకులాల కార్యదర్శి సైదులు తదితరులు



గురుకుల పాఠశాలలో సహపంక్తి భోజనం చేస్తున్న ఐపీఎస్ శ్రీధర్